క్లుప్తంగా

బాలికను వేధించిన వ్యక్తి అరెస్టు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన బాలికను వేధించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. కొప్పుల గ్రామానికి చెందిన పసుల శివరాజ్ అదే గ్రామానికి చెందిన ఓ బాలికను నెల రోజులుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈనెల 2వ తేదిన బాలిక కిరాణానికి వెళ్లి వస్తుండగా ఇదే అదునుగా భావించిన శివరాజ్ ఆ బాలికను వేధించాడు. ఈ విషయం బాలిక తన తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్రవంతికి బంగారు పతకం



వేలేరు : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వేలేరు కేజీబీవీ విద్యార్థిని స్రవంతి బంగారు పతకం సాధించినట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కే.స్రవంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతనెల 29 నుంచి ఈనెల 1 తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో స్రవంతి.. తెలంగాణ బాలికల జట్టు తరఫున పాల్గొని బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్రవంతిని డీఈఓ అబ్దుల్ హై, జీఈసీఓ సునీత, జిల్లా సాఫ్ట్‌బాల్ కార్యదర్శి రాజేందర్, పీఈటీ కిరణ్మయి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గుడుంబా విక్రేతకు జరిమానా

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు వడ్డెర కాలనీకి చెందిన గొల్లెన రజిత గతంలో గుడుంబా కేసులో పట్టుబడగా బైండోవర్ చేసినట్లు కాజీపేట సీఐ చంద్రమోహన్ గురువారం తెలిపారు. కాగా సదరు మహిళ మళ్లీ గుడుంబా విక్రయిస్తుండగా పట్టుబడడంతో ఆమెను పరకాల సబ్‌జైలుకు తరలించామని, ఆమెపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.50వేలు జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. ఎస్సై మమత, హెడ్ కానిస్టేబుళ్లు ఖలీల్, కోటి తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన పుల్లూరి మల్లికార్జున్ బెల్ట్‌షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై గైకడి అనిల్‌కుమార్ తెలిపారు. దాడుల్లో రూ. 3,803 విలువగల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్, ధర్మారం, రామకృష్ణపూర్, పుల్లిగిల్ల గ్రామాల్లో 11 కేవీ విద్యుత్తు లైన్లకు మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ కె.విశ్వప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వాహన తనిఖీలు



ఐనవోలు : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం హైవే, పున్నేలు క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై గైకడి అనిల్‌కుమార్ తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

పెద్దమ్మతల్లి బోనాలు

వేలేరు : పీచర గ్రామంలో పెద్దమ్మతల్లి శిఖర కళశ ప్రతిష్ఠాపన, బోనాలను ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాలు, డీజే పాటలతో గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించారు. సంఘం అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు కనుకరాజు, కార్యదర్శి యాదగిరి, కోశాధికారి తిరుపతి, డైరెక్టర్లు నాగరాజు, తిరుపతి, సంపత్, రాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



సాయిబాబా మందిరానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్ సర్కిల్‌లో షిర్డీ సాయిబాబా సత్సంగ్ మందిరం నిర్మాణానికి గురువారం చేపట్టిన భూమిపూజ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మత్స్యగిరి స్వామి ఆలయాన్ని సందర్శించగా ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రవి, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధానకార్యదర్శి వేణు, సంయుక్త కార్యదర్శి రవీందర్, కోశాధికారి ప్రకాశ్, ఎంపీటీసీ చంద్రప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు శాంతరవి, మార్కండేయ, రవీందర్, కృష్ణమూర్తితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా..

మండల కేంద్రంలో నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా సత్సంగ్ మందిర నిర్మాణానికి సాయం అందిస్తానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. గురువారం జరిగిన భూమిపూజ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, హైకోర్టు న్యాయవాది రూపేందర్, నాయకులు రమణారెడ్డి, నిమ్మల మహేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ, తదితరులు

ఐనవోలు : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని డీసీఓ నాగేశ్వర్‌రావు కోరారు. మండలంలోని కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెం, పంథిని, పున్నేలు, ఒంటిమామిడిపల్లి, వెంకటాపురం, గర్మిళ్లపల్లి, ఉడుతగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ. 2,185 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. రైతుల సౌకర్యార్థమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు, సొసైటీ సీఈఓ కోతి సంపత్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులతో విద్యార్థుల జీవితంలో ఉన్నతి



నర్సంపేట : ప్రాజెక్టులతో విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. తెలంగాణ కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోనిర్వహించిన 'జిజ్ఞాస-స్టూడెంట్స్ స్టడీ' ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాల నుంచి భౌతిక, గణిత శాస్త్రాల నుంచి రెండు ప్రాజెక్టులు సమర్పించిన క్రమంలో విద్యార్థులను కళాశాల ఆవరణలో గురువారం ఆయన అభినందించి మాట్లాడారు. ప్రాజెక్టుల వల్ల విద్యార్థులు నేర్చుకున్న వివిధ పాఠ్యాంశాలు నిజజీవితంలో ఏ విధంగా ఉపయోగపడతాయో తెలుసుకోవచ్చని చెప్పారు. భౌతిక శాస్త్రంలో పి.త్యాగయ్య పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ చంద్రయాన్ 3-సక్సెస్ అండ్ ఇంపాక్ట్ ఆన్ ఫ్యూచర్ స్పేస్ మిషన్ ఆఫ్ ఇండియా' ప్రాజెక్టును ఎ.రచన, జె.మౌనిక, బి.అంకిత, కె.అనూష, బి.రజనీకాంత్, ఈ.కార్తీక్ సమర్పించినట్టు తెలిపారు. విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం కలిగించేలా అటానమస్ కరికులంలో ఏటా అన్ని సబ్జెక్టుల్లో ప్రాజెక్టు ప్రజెంటేషన్‌ను తప్పనిసరి యాక్టివిటీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఏ.శ్రీనాథ్, కళాశాల జిజ్ఞాస సమన్వయకర్త డాక్టర్ లకన్‌సింగ్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రాజెక్టు ప్రజెంటేషన్ కోసం డాక్టర్ జి.ప్రసూన, డాక్టర్ వి.పూర్ణచందర్ తోడ్పాటును అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.త్యాగయ్య, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ ఐ.శివనాగశ్రీను, ఎం.సమ్మయ్య, డాక్టర్ టి.సుమతి, డాక్టర్ బి.రమేశ్, ఎం.శైలజ, డాక్టర్ వి.పూర్ణచందర్, డాక్టర్ ఆర్.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు : సీఐ

పరకాల : రానున్న పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఏలాంటి గొడవలు సృష్టించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీఐ రవిరాజు రౌడీ షీటర్లను హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం పరకాల, నడికూడ మండలాలోని రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, గొడవల్లో తలదూర్చినా, నేరాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రవిరాజు

గుడిసెలు వేసినవారిపై చర్య తీసుకోవాలి

దామెర : తన వ్యవసాయ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి గుడిసెలు వేసినవారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత యజమాని రామోజు సుధీర్ కుమార్ కోరారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఒగ్లాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 109, 110, 113, 114, 122ల్లో 26 ఎకరాల భూమిలో గత సంవత్సరం సీపీఐ చెందిన కొంత మంది గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఈ విషయమై పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మార్చి 30వ తేదీన మరోసారి తమ భూమిలోకి వారు ప్రవేశించి గుడిసెలు వేయడంతో పాటు, జేసీబీ సాయంతో కందకాలు తీసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తమ భూమిలో ఎందుకు కందకాలు తీస్తున్నారని ప్రశ్నించినందుకు బూతులు తిడుతూ తమపై దాడికి యత్నించి చంపుతామంటూ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. సీపీఐ నాయకులు కొట్టెపాక రవి, అంబి సాంబయ్య, కండె నర్సయ్య, దండు భాస్కర్, నాగబెల్లి ఐలయ్య, అమ్మ సాంబయ్య, గాదెం జయక్క, కాశిపాక దుర్గయ్య, ఎడ్ల మంజుల దాడికి యత్నించిన వారిలో ఉన్నారని పేర్కొన్నారు. తమ భూమిలో కందకం తీయడం మూలంగా సుమారు రూ.50,000 వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. కాగా అక్రమంగా తమ భూమిలోకి ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకొని, గుడిసెలు తొలగించాలని అధికారులను వేడుకున్నారు. సుధీర్ కుమార్‌తో పాటు తన సోదరుడు శిరీష్‌కుమార్ ఉన్నారు. కాగా ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా పట్టా భూమిలో గుడిసెలు వేసినవారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

టెన్త్ మిత్రులు, పూర్వ విద్యార్థుల ఔదార్యం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని శ్రీగురుకుల విద్యాలయ పూర్వవిద్యార్థి దొంతి రవికుమార్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి టెన్త్ నాటి మిత్రులు, స్కూల్ పూర్వవిద్యార్థులు కలిసి రూ.1,22,847 సాయం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ కూతురు అద్విక పేరిట ఎల్ఐసీలో డిపాజిట్ చేసిన రూ.97,347 బాండ్‌ను, రవికుమార్ తల్లికి రూ.25,500 నగదును రవికుమార్ స్నేహితులు మండల మహేందర్, అల్లి రవికుమార్, డ్యాక కిరణ్ గురువారం అందజేశారు. తొలుత రవికుమార్ కుటుంబాన్ని అతడి మిత్రులు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆపద వచ్చినా తెలిపర్చాలని సూచించారు. రవికుమార్ కుటుంబాన్ని ఆదుకునేందుకు 2008 టెన్త్ బ్యాచ్‌తోపాటు పూర్వవిద్యార్థులు (కొందరు ఎన్ఆర్ఐలు) కలిసి రూ.1,22,847 సమీకరించినట్టు చెప్పారు. పిల్లలిద్దరూ ఐదేళ్లలోపు చిన్నారులే కావడం, పేదరికం నేపథ్యంలో తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రవికుమార్ సతీమణి భవానీ ప్రభుత్వాన్ని, జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు.



బాండ్, నగదు అందజేస్తున్న మహేందర్

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్వర్‌రావు

సంగెం : బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు స్పష్టం చేశారు. మండలంలోని కుంటపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన పార్టీ మండల బూత్ కమిటీల అధ్యక్షుల, ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాజేశ్వర్‌రావు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ గెలవాలని ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌లో పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజలు అసహనంతో ఉన్నారని తెలిపారు. వరంగల్ ఎంపీగా అరూరి రమేశ్‌ను గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీపీ పన్నుల వసూళ్లలో వెనుకబాటు

సంగెం : గ్రామ పంచాయతీ పన్నుల వసూలులో మండలం వెనుకబడింది. సరాసరి 71 శాతమే వసూలైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష్యం 46,24,683 కాగా గడువు ముగిసే సరికి రూ.32,73,582 వసూలయ్యాయి. గాంధీనగర్‌లో 109, కొత్తగూడెంలో 104 శాతం పన్నులు వసూలు కాగా గవిచర్లలో 61, షాపూర్‌లో 65 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. పన్నుల వసూలులో చిన్న గ్రామాలు ఆదర్శంగా నిలువగా పెద్ద గ్రామాలు వెనకబడ్డట్టు తెలుస్తోంది. గవిచర్లలో రూ 1,74,002, రామచంద్రపురంలో రూ.95,593, మొండ్రాయిలో రూ 61,691 వసూలు కావాల్సి ఉంది. మొత్తం 11 గ్రామాల్లో నూరు, 12 గ్రామాల్లో 90 శాతానికిపైగా పన్నులు వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగియడంతో బకాయిలు 2024-25 ఆర్థిక సంవత్సర డిమాండ్ తోపాటుగా ఎరియర్లుగా కలవనున్నవి.

'కుడా' చైర్మన్‌కు అభినందన

సంగెం : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని మండలానికి చెందిన పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శాలువా కప్పి అభినందన తెలిపారు. పల్లారుగూడ, వీఆర్ఎస్ తండాల గ్రామ కమిటీల అధ్యక్షులు గుగులోత్ స్వామి, నర్సింహ నాయక్ పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీగా కావ్య గెలుపు ఖాయం

వర్ధన్నపేట : వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు ఖాయమని ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ ధీమా వ్యక్తం చేశారు. అధికార ప్రతినిధిగా నియమితుడైన సందర్భంగా ఆయన్ను మండల కేంద్రంలో నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహదేవ్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో కొనసాగినా సామాన్య ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. కడియం కావ్య గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. తుక్కుగూడలో ఈనెల 7న (శనివారం) నిర్వహించే జనజాతర సభకు నియోజకవర్గం నుంచి శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. తన నియామకానికి సహకరించారంటూ ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు సమ్మెట సుధీర్, మహ్మద్ అఫ్సర్, చిదురాల కుమారస్వామి పాల్గొన్నారు.

'రైతు రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే'



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

ఎల్కతుర్తి : దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రైతులకు విద్యుత్ బకాయిలతో పాటు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేకే దక్కుతుందని ఆ పార్టీ మండల సీనియర్ నాయకుడు కొలుగూరి రాజు అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్ తదితర పథకాల అమలుపై కొందరు తప్పుడు ఆరోపనలు చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కొంత సమయం పడుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కరువు వచ్చిందని కొందరు అజ్ఞానులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వేసవిలో వర్షాలు కురుస్తాయా అని ప్రశ్నించారు. సాగునీటి కోసం దేవాదుల ప్రాజెక్టుకు వెళ్లి నీరు ఎంత ఉందని పరిశీలించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడంతో ప్రాజెక్టులు కుంగిపోయాయని, ప్రస్తుతం అందులో నీటిని నింపే పరిస్థితి లేదన్నారు. దీంతో నీటి ఎద్దడి తలెత్తుతోందన్నారు. బీజేపీ నాయకులు స్థాయిని మించి విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు రవీందర్, తిరుపతి, లింగమూర్తి, శంకర్, సురేష్, అనిల్, శ్రీనాథ్, రాజు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ' పనులు పూర్తిచేయాలి

● ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు

పరకాల : మండలంలోని వివిధ పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులను జూన్ 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఏంఈఓ రమాదేవి అన్నారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో గురువారం ఆయన సమావేశమై మాట్లాడారు. పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పన, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, తరగతి గదులకు విద్యుత్ సరఫరా, సౌరఫలకాల ద్వారా విద్యుత్ బిల్లు తగ్గించడం, ఏకరూప దుస్తులు కుట్టించడం వంటి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేందర్, సాంబయ్య, మధు, గౌస్, తిరుపతిరావు, అశోక్, రాజు, ఐకేపీ ఏపీఎం క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



బారసాల నిర్వహిస్తున్న మహిళలు

శాయంపేట : చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. ఆడపిల్లలు చదివించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. మండలంలోని పత్తిపాక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పోతుగంటి రజనీకర్-కల్పన దంపతుల కుమార్తెకు బారసాల నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు స్కానింగ్ సెంటర్ల ద్వారా గర్భంలో ఉన్న శిశువు ఆడ, మగ తెలుసుకొని ఆడపిల్ల అయితే అబార్షన్ చేయించుకుంటున్నారని, అది చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను ఎదగనివ్వాలని సూచించారు. బాలురతో సమానంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, మహిళా సాధికారిక కేంద్రం అధికారి మానస, అంగన్‌వాడీ టీచర్లు ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

దామెర : మండలంలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా నీటి సరఫరాపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి కోసం తీసుకుంటున్న చర్యలు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ కుమార్ వివరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లాల ద్వారా నీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం ఉపాధిహామీ పనుల వివరాలు, గ్రామాల వారీగా టార్గెట్ చేరుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ రాంగాచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పిల్లలమర్రి సతీష్‌కుమార్, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీలోకి కడియం అనుచరులు'

● ఎంపీపీతో సహా నాయకుల చేరిక



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న ఎంపీపీ సమ్మిరెడ్డి, తదితరులు

వేలేరు : మండలంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కడియం శ్రీహరి అనుచరులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వీరికి సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటామని సీఎం చెప్పినట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ సమ్మిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుజ్జుల రాంగోపాల్ రెడ్డి, విజయపురి మల్లికార్జున్‌తోపాటు పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు చేరినవారిలో ఉన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద గురువారం ఆయన వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని రకాల వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దన్నారు. రాంగ్ రూట్లో వెళ్లడం ద్వారా జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.